
కథ

# లంబోదరమ్స్ సెల్ మెమొరీస్

ఆదుర్తి బాల

లంబోదరం భారీ శరీరం భూమ్మీదే ఉన్నా మనసు మాత్రం దూది పింజలా తేలికై అలా అలా.. పై..పై..కి తేలిపోయి మేఘాల పల్లకిలో ఊరేగుతోంది. లంబోదరం ఆనందాం బుధిలో ఇంతగా పల్టీలు కొట్టడానికి ముఖ్యకారణం అతడు



కొత్తగా కొనుక్కున్న సెల్‌ఫోను.

''ఇంట్లో లాండ్ ఫోనుండగా సెల్ ఫోను అంత అవసరమా'' గొణిగింది అతని భార్య చాముండేశ్వరి.

''అవసరమా అనే ప్రశ్న అనవసరం. శివుడి మెళ్ళో నాగుపామునెందుకు ధరిస్తాడు? మిగతా దేవుళ్ళకంటే తనని విలక్షణంగా చాటుకోవడానికి తనని ప్రత్యేకంగా గుర్తించడానికి. విష్ణుమూర్తి మెడలో కౌస్తుభ మణిహారం ఎందుకూ అంటే అదొక స్టేటస్ సింబల్ అన్నమాట.''

''ఇప్పుడు దేవుళ్ళ గొడవెందుకు?'' చిరాకుపడింది చాముండేశ్వరి.

''దేవుళ్ళంతటి వాళ్ళే తమ ఐడెంటిటీ చాటుకోవడానికీ, స్టేటస్ మెయిన్‌టైన్ చేయడానికీ రకరకాల పద్ధతుల వబించారు. ఆఫ్ట్రాల్ మన మెంత. చేతిలో సెల్ ఉంటే ఆ హంగు వేరు- అదొక స్టేటస్ సింబల్- దట్సాల్'' చెప్పాడు లంబోదరం.

''హు..నాకొక పట్టుచీర కొనమంటే మాత్రం చేతులు రావే..'' మూతి తిప్పింది చాముండేశ్వరి.

అసలు లంబోదరం సెల్‌ఫోన్ కొనడానికి కొంత నేపథ్యముంది. రైళ్ళల్లో, బస్సుల్లో, పబ్లిక్ ప్లేసెస్‌లో, హెవీ ట్రాఫిక్‌లో టూవీలర్ డ్రైవ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ రకరకాలుగా బిల్డప్‌లిచ్చే జనాలని చూసినప్పుడల్లా తనని కాసేపు వాళ్ళ ప్లేస్‌లో ఊహించుకొని మురిసిపోయేవాడు. తన ఊహలన్నీ ఊహలుగానే మురిగిపోకముందే తనూ ఓ సెల్ కొనుక్కొని ఉబలాటం తీర్చుకోవాలనుకున్నాడు.

తీరా సెల్ ఫోన్ కొన్నాక దాన్ని వంటిమీద ఎక్కడ అమర్చుకుంటే బాగుంటుందో తేల్చుకోడానికి సెల్ పట్టుకుని అద్దం ముందు నిలబడ్డాడు. జేబులో పెట్టుకొని చూసుకున్నాడు.

''మీకసలు బుర్ర లేదు. సెల్ నుంచి వచ్చే విద్యుదయస్కాంత తరంగాల వల్ల హార్ట్ దెబ్బతింటుందట. సెల్‌ఫోను గుండె దగ్గరిగా మాత్రం ఉండకూడదు'' తన పరిజ్ఞానాన్ని వెల్లడించింది చాముండేశ్వరి.

సరే అయితే అంటూ జేబులోంచి తీసి నడుంకి అమర్చుకుని బాగుంది కదూ అన్నట్టు కళ్ళెగరేసాడు భార్యవంక చూసి.

భర్త నంది అంటే కాదు పంది అని వాదించే చాముండేశ్వరి ''హు నా మొహంలా ఉంది'' అన్నది నుదురు కొట్టుకుంటూ.

''అయితే చాలా బాగుందన్న

మాట హి-హి'' అంటూ అందమైన అబద్ధం ఆడాడు లంబోదరం.

''అయితే మీ మొహంలా ఉంది'' అన్నది చాముండేశ్వరి ఠక్కున. ''అంటే నీ ఉద్దేశ్యమేమిటే? బాగుందనా బాగోలేదనా?''

''మీ తెలివి కూడా మీ మొహంలాగే అస్సలు బాగులేదనీ. లేకపోతే ఏమిటండీ అంత భారీ బొజ్జ కింద ఆ బుజ్జిముండ దీనంగా ఎలా నక్కిందో చూశారా?''

లంబోదరం కాసేపు ఆలోచించాడు. ''ఆ.. ఐడియా- ఈ సెల్‌ఫోన్‌ని జబ్బకి కట్టుకుంటే వెరైటీగా ఉంటుంది. ఏమంటావ్?'' అన్నాడు భార్య వంక చూసి.

''ఏడిసినట్టుంటుంది. ఇంత ఆలోచనెందుకు? సుబ్భరంగా మెళ్ళో వేసుకోండి'' అన్నది చాముండేశ్వరి.

''నే చెప్పింది ఏనాడు ఒప్పుకున్నావు గనక నీ పేరు చాముండేశ్వరి అని కాదు. చామొండేశ్వరి అని పెట్టాల్సింది మీ వాళ్ళు. ఒఠ్ఠి మొండి ఘటం'' అనుకుంటూ భార్య చెప్పిన ఆజ్ఞలాటి సలహాని పాటించాడు లంబోదరం.

ఇహ అక్కడ్నించి లంబోదరం తీరే మారిపోయింది. పదివేలు పోసి కొనుక్కున్న సెల్‌ఫోను బొజ్జమీద కదిలినప్పుడల్లా చక్కిలిగిలి పెట్టినట్టు పులకించి పోయేవాడు. అప్పుడప్పుడు దాన్ని ఆప్యాయంగా తడిమి గుండెకి హత్తుకునే వాడు. కొత్త పెళ్ళికూతురు మంగళసూత్రాన్ని చూసుకొని మురిసిపోయినట్టుగా మురిసేవాడు. ఇహ ఫోన్ రింగయితే చాలు చుట్టుపక్కల ఎవరూ లేకపోయినా ఎక్స్‌క్యూజ్‌మీ అంటాడు. సెల్లు చెవికానించుకుని అంతరిక్షంలోకి చూస్తూ సొల్లు మొదలెడతాడు. సంభాషణ మధ్యలో ఐ.సీ.. య్యా..ఓ.కె. నో..నో.. నో ప్రాబ్లమ్ యార్.. లాటి పదాలు వాడతాడు. సొల్లు అంతా అయ్యాక ఓ.కె.బై అంటూ ముక్తాయింపు నిస్తాడు.

అలా సెల్ చేత పుచ్చుకుని రకరకాల బిల్డప్పులిస్తున్న లంబోదరానికి ఓరోజు దివ్యమైన ఆలోచన వచ్చింది. అది అమలు చేయాలంటే భార్య సహకారం కావాలి కనుక ఆమెను ప్రసన్నం చేసుకోవడానికి ఆఫీసు నుండి ఇంటికెళ్ళేటప్పుడు ఓ కిలో స్వీట్స్ కొని తీసుకెళ్ళాడు.

అతడు ఇంటికెళ్ళేసరికి ఎప్పట్లాగే రకరకాల ఛానల్స్‌కి ఫోన్లు చేస్తూ టి.వి.ముందు సెటిలై ఉంది చాముండేశ్వరి.

భార్య పక్కనే కూర్చుని గొంతులో సాధ్యమైనంత ప్రేమ ఒలకపోస్తూ ''చాముండీ'' అని పిలిచాడు.

''అబ్బ ఉండండీ'' విసుక్కుంది చాముండేశ్వరి.

'హు.. దీని టీవీ పిచ్చి తగలెయ్య' మనసులోనే విసుక్కుంటూ మొహం కాళ్ళూ చేతులూ కడుక్కొని లుంగీ కట్టుకుని వచ్చాడు.

ప్రకటనల టైంలో ఇవతలకొచ్చింది చాముండేశ్వరి.

''పసుపుతాడు సీరియల్‌లో హీరోయిన్ మొగుడిలాగా మీకు నామీద ఇవాళ ఇంత ప్రేమ పుట్టుకొచ్చిందేమిటి?'' భర్త తెచ్చిన స్వీట్లని రెండు బుగ్గల్నిండా పట్టించి పరాపరా నములుతూ అన్నది చాముండేశ్వరి.

''పిచ్చిదానా నువ్వంటే నాకెప్పుడూ ప్రేమేనే. నువ్వే టి.వి.ధ్యాసలో పడి నా ప్రేమని గుర్తించట్లేదు. అసలింతకీ చెప్పేదేంటంటే నువ్వు నాకో చిన్న సాయం చెయ్యాలి'' అన్నాడు లంబోదరం.

''ఓహో అందుకేనన్నమాట స్వీట్స్ ఇచ్చి కాకాపట్టింది'' చాముండేశ్వరి అన్నది.

''యూ ఆర్ ఎ వెరీ ఇంటలిజెంట్ లేడీ'' భార్యని పైకి మెచ్చుకొని స్నిఫర్ డాగ్‌లాగా విషయాన్ని ఇట్టే వాసన పట్టేస్తావ్ అని మనసులో అనుకున్నాడు లంబోదరం.

భర్త తనని ఇంటలిజెంట్ అన్నందుకు పొంగిపోయి ''చెప్పండి ఏం సాయం చేయాలి మీకు?'' అన్నది చాముండేశ్వరి.

''వెరీ సింపుల్..నేను గడప దాటి బైటికెళ్ళింది మొదలు మళ్ళీ గడపలో కాలు పెట్టేవరకూ అరగంట కొకసారి ఫోన్జెయ్యాలి''

''కుదర్దు. నా టి.వి.సీరియల్స్‌కి డిస్టర్బెన్స్'' ఖండితంగా చెప్పింది చాముండేశ్వరి.

''ప్లీజ్ కాదనకు. సీరియల్స్ మధ్యలో టైం ఉంటుందిగా అప్పుడు చేయి నీకు నెక్లెస్ కొనిస్తా మరి'' భార్య ముఖకవళికలని పరిశీలిస్తూ

## బిపాషాయే బెస్టు

ఇటీవల ముంబాయిలో ఓ సంస్థ వారు చిన్న సర్వే చేశారు. అందులో ప్రస్తుతం వున్న బాలీవుడ్ భామల్లో గ్లామరస్ అండ్ ఎట్రాక్టివ్ స్టార్ ఎవరు? అని అడిగారట. సహజంగా ఐశ్వర్యా రాయ్ అని జవాబు వస్తుందనుకుంటారు చాలామంది. కానీ అందరి అంచనాలు తారుమారు చేస్తూ 'బిపాషా బసు' అన్నారట. ఈమధ్య కాలంలో ఠక్కున ఆకట్టుకునే అందాలతో బిపాషా అలరిస్తోంది అనేది వాళ్ల అభిప్రాయమట. ఈ సంగతి తెలిసాక బిపాషా ఆనందం మాట ఎలా వున్నా ఐశ్వర్యే కాస్త ఫీలయివుంటుంది కదా!



అన్నాడు లంబోదరం.

అతడూహించినట్టుగా చాముండేశ్వరి మొహం హైమాస్ట్ బల్బులాగా వెలిగిపోయింది ''సరే అయితే'' అన్నది.

''చూడు చాముండీ ఫోన్ చేసి ఏదోకటి మాట్లాడడమే నీ వంతు. నీకు ఫోన్లో నే మాట్లాడే మాటలు వింతగా అనిపించవచ్చు. కానీ నువ్వు అదేం పట్టించుకోకూడదు తెలిసిందా'' అన్నాడు లంబోదరం.

''సరే కానీ- ఓ కండిషన్. మీరు నాకు వారం రోజుల్లోగా గోల్డునెక్లెస్ కొనిస్తే సరి. లేకపోతే ఫోన్ కాల్స్ బంద్ చేస్తా'' చాముండేశ్వరి అంది. ఒప్పుకున్నాడు లంబోదరం.

★ ★ ★

లంబోదరం ఫైల్లో తలదూర్చి సీరియస్‌గా వర్కు చేసుకుంటున్నాడు.

కుయి- కుయి మంది సెల్లు.

ఆ ఫోన్ కోసమే ఎదురు చూస్తున్నట్టు గబుక్కున ఫోనందుకున్నాడు లంబోదరం.

''నేనండీ చాముండేశ్వరిని'' అన్నది అవతలి కంఠం.

ఓరగా చూశాడు లంబోదరం. టైపిస్టు వనజాక్షి కళ్ళు విప్పార్చుకొని తననే అబ్జర్వ్ చేస్తున్నట్టు అర్థమైంది. ఇహ ఫోన్లో రెచ్చిపోయాడు.

''ఎవరూ? ఆ.. కిరీటీ నువ్వా చెప్పు. ఏమిటీ ఈవేళప్పుడు ఫోన్జేశావ్? ఏమిటీ సాయంత్రం తాజ్ హోటల్లో నాకు పార్టీ ఇస్తానంటావా? ఏంటి సంగతి? కంగ్రాట్స్.. అయితే నీ సినిమా ఛాన్స్ నా చలవే నంటావ్! ఇందులో నేన్చేసిందేముందీ... చిరంజీవి నాకు క్లోజ్ కాబట్టి నీ గురించి కాస్త రికమండ్ చేశాను. అంతే..ఈ మాత్రానికే అబ్బ.. అంత బతిమాలక్కర్లేదురా.. తప్పకుండా వస్తానన్నాగా. ఇక నన్నొదిలెయ్. ఓ.కె. సాయంత్రం సిక్సో క్లాక్కల్లా తాజ్‌లో ఉంటా. సరేనా. కారు పంపిస్తావా...నో...నో...నీకు తెలుసుగా నాకిలాంటి ఆర్భాటాలు నచ్చవని..ఇంక ఫోన్ పెట్టేయ్..'' ఫోన్ కట్ చేసి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నట్టు యాక్షన్ చేస్తూ వనజాక్షి వంక చూశాడు.

''మీకు..మీకు చిరంజీవి తెలుసా?'' సంభ్రమంగా అన్నది వనజాక్షి.

''పవన్ కళ్యాణ్ నేనూ క్లాస్‌మేట్స్‌మి, క్లాస్ బెంచ్‌మేట్స్‌మి'' అన్నాడు లంబోదరం.

''ఔనా'' నమ్మలేకపోతున్నట్టుగా అన్నది వనజాక్షి.

''య్యా'' కోశాడు లంబోదరం.

వనజాక్షి లంబోదరం వంక ఆరాధనగా చూసింది. లంబోదరానికి కావల్సిందదే. అరగంట గడిచింది.

'ఓహో' టి.వి.వాళ్ళడిగిన ప్రేక్షకుల ప్రశ్నకి జవాబు తెలీక చిరాగ్గా ఉంది చాముండేశ్వరికి. ఆపద్బాంధవుడిలా గుర్తొచ్చాడు. భర్త స్కూల్ రోజుల్నించీ క్లాసులెగ్గొట్టి వచ్చిన ప్రతి సినిమాని వదలకుండా చూసిన ఘన చరిత్ర లంబోదరానిది. ఈ ప్రశ్నకి భర్త మాత్రమే కరెక్టు సమాధానం చెప్పగలడు అనిపించి లంబోదరానికి ఫోన్ కొట్టింది చాముండేశ్వరి.

''హలో లంబోదరం స్పీకింగ్'' స్టయిల్‌గా వినిపించింది చాముండేశ్వరికి.

''ఇదుగో ఇందాకటిలా పిచ్చివాగుడు కాకుండా సరిగ్గా మాట్లాడండి. అవతల నేను ఎస్.ఎం.ఎస్. ఇచ్చుకోవాలి'' కసిరినట్టుగా అన్నది చాముండేశ్వరి. 'ఇంట్లోనే కాదు ఫోన్లోనూ దబాయింపేనా- అమ్మాయిది సింహ రాశి..నీదా మేషరాశి. మేకని చూస్తే సింహానికేమనిపిస్తుంది? ఈ సంబంధం వద్దురా- అని మేనమామ హెచ్చరించినా కట్నం, కనకం భారీగా ముట్టచెబుతారని ఈ సంబంధం చేసుకున్నాడు తను'- అనుకొని, హు అని నిట్టూర్చి ''ఏమిటో చెప్పు'' అన్నాడు.

''కాస్కో కాస్కో చూస్కో చూస్కో- సినిమా దర్శకుడెవరు?''

ఒక్క క్షణం ఆలోచించి వనజాక్షి తన వంక చూడ్డం గమనించి-

''వాడా..ఆ సినిమా డైరెక్షన్ చేసింది పిచ్చేశ్వర్రావు. మనకి బాగా కావాల్సిన వాడేలే..ఏమిటి? ఇంటికి ఫోన్జేశాడా.. సెల్‌కి చెయ్యమని నంబరివ్వకపోయావా.. ఓ.కె.వెరీగుడ్. నే మాట్లాడతాలే వాడితో..బై'' అంటూ ఫోన్ పెట్టేశాడు.

'భర్తనొకసారి ఎర్రగడ్డ తీసుకెడితే బెటరు' అనుకుంది చాముండేశ్వరి. ''ఏమిటీ సినీ డైరెక్టర్ పిచ్చేశ్వర్రావుగారు కూడా మీకు తెలుసా?'' విస్తుపోతూ అడిగింది వనజాక్షి.

''తెలుసా అని చిన్నగా అడుగుతారేంటండీ బాబూ! వాడూ నేనూ గోళీలాడుకునే వయసు నుంచీ గోల్ఫ్ ఆడుకునే వయసు దాకా ఒకే కంచంలో తిని ఒకే మంచం మీద పడుకున్నామంటే నమ్మండి. ఓసారి వాళ్ళ నాన్న ఎందుకో తిట్టాడని కోపమొచ్చి ఎవరికీ చెప్పకుండా మద్రాసు పారిపోయాడు. అక్కడ అష్టకష్టాలూ పడి చివరకు డైరెక్టర్‌గా సెటిలయ్యాడనుకోండి...ఏమిటో ఎవరి జీవితం ఎలా మలుపు తిప్పుతాడో దేవుడు'' తన కోతలకి కాస్త వేదాంతాన్ని టచ్ చేశాడు లంబోదరం.

''అంత గొప్ప వాళ్ళతో పరిచయాలున్న మన లంబోదరం నిజంగా గ్రేట్'' నాల్గైదు కంఠాలు కోరస్‌గా పలికాయ్. వాళ్ళు- హెడ్‌క్లర్క్ అవతారం, ఎకౌంటెంట్ సుందరం, క్లర్క్ దామోదరం.


తను మాట్లాడిన మాటలు వీళ్ళందరూ వినేశారన్నమాట. అంటే రేపట్నించి వీళ్ళందరి దృష్టిలో తనో వి.ఐ.పి. అన్నమాట. సాధించాపురా లంబోదరం, సెల్లుతో అనుకున్నవన్నీ సాధించావ్. మనసులోనే పొంగిపోయాడు లంబోదరం. కానీ కాసేపట్లో ముంచుకు రాబోతున్న ఉపద్రవాన్ని ఏ కోశానా ఊహించని లంబోదరం సెల్ టేబుల్ మీదుంచి టాయిలెట్‌కి వెళ్ళాడు. సరిగ్గా అదే సమయంలో ఆఫీసరు లంబోదరం టేబుల్ దగ్గరికి రావడం సెల్ మోగడం ఒకేసారి జరిగింది. లంబోదరం టాయిలెట్ కెళ్ళడం చూసిన ఆఫీసరు సెల్ అందుకుని బటన్ ప్రెస్ చేసి హలో అన్నాడు.

''నేనండీ చాముండేశ్వరిని''

''చూడమ్మా నేను లంబోదరం పై

## గజాలా సంబరం

**తెలుగులో దాదాపు తెరమరుగైన గజాలాకి ఇప్పుడు తమిళనాట మంచి ఆదరణ లభిస్తోంది. ఇటీవలే తమిళంలో హిట్ అయిన ఓ సినిమా 'విజేత' పేరుతో అనువాదం అయింది. తమిళంలో మంచి దర్శకుల చిత్రాల్లో చాన్స్‌లు ఆమెను వెతుక్కుంటూ వస్తుండడంతో గజాలా ఆనందానికి అవధుల్లేవిప్పుడు. ఏ భాషలో అయితేనేం నేను బిజీగా వున్నాను- అన్నాను అంటోంది గజాలా. సంతోషం.**



ఆఫీసర్ని మాట్లాడుతున్నాను. మీరు లంబోదరానికి ఏదైనా మెసేజ్ చెప్పాలంటే కాసేపాగి ఫోన్జేయండి'' అన్నాడు లంబోదరం ఆఫీసర్.

''హు..పిచ్చి వాగుడికి తోడు గొంతు మార్చడం కూడా మొదలెట్టారన్నమాట. అయినా మీరెలా మాట్లాడినా నన్ను పట్టించుకోవద్దన్నారు కాబట్టి ఆ సంగతి వదిలేస్తా. 'హి..హి' ఛానల్ వాళ్ళకి ఎస్.ఎమ్.ఎస్. చేయాలి. 'వస్తావా..వస్తావా' సినిమాలో హీరోయిన్ వేసుకున్న స్కర్టు పొడవు అర మీటరా-పావు మీటరా-త్వరగా చెప్పండి. కరెక్టు సమాధానం చెప్తే డైమండ్ పెండెంట్ ఇస్తారుట. త్వరగా చెప్పండి'' తొందరపెట్టింది చాముండేశ్వరి.

''చూడమ్మా ఇలాంటి విషయాలు ఇంట్లో డిస్కస్ చేసుకోవాలి. ఆఫీస్‌కి ఫోన్ చేసి వర్కు డిస్టర్బ్ చేయకూడదు'' కోపాన్ని అణచుకుంటూ అన్నాడు ఆఫీసరు.

''హు..నేనేమైనా కావాలని చేశానా- మీరేగా అరగంటకోసారి ఫోన్జేయమని చెప్పింది'' భర్త గొంతు మార్చి మాట్లాడుతున్నాడనుకొని కోపంగా అరిచేసింది చాముండేశ్వరి.

అంతే- ''లంబోదరం'' భీకరంగా గర్జించాడు ఆఫీసర్.

అప్పుడే వస్తున్న లంబోదరం ఆ అరుపుకి ఉలిక్కిపడ్డాడు. మధ్యందిన మార్తాండుడిలా పొగలు గక్కుతున్న ఆఫీసర్ ముందు మోకరిల్లాడు.

''నిన్ను వారం రోజులు సస్పెండ్ చేస్తున్నాను''

''సారీ సర్ ఇంకెప్పుడూ ఆఫీస్ అవర్స్‌లో టాయిలెట్‌కి వెళ్ళను. లంచ్‌బ్రేక్ వరకూ ఆపుకుంటాను'' దీనంగా అన్నాడు లంబోదరం.

''చూడు మిస్టర్ నీకసలు బుర్రలేదు. నేను నిన్ను సస్పెండ్ చేస్తానన్నది నువ్వు టాయిలెట్‌కి వెళ్ళినందుకు కాదు. ఆఫీసంటే నీ అత్తారిల్లనుకున్నావా- అరగంటకోసారి ఫోన్జేయమని మీ ఆవిడకి చెప్పి అడ్డమైన పిచ్చివాగుడూ వాగుతున్నావట'' మండిపడ్డాడు ఆఫీసర్.

''నమ్మకండి సార్ ఎవరో గిట్టని వాళ్ళు..''

లంబోదరం చెప్పేది వినిపించుకోకుండానే భగ్గుమన్నాడు ఆఫీసర్.

''ఎవరో కాదు మీ ఆవిడ చాముండేశ్వరి స్వయంగా ఫోన్జేసి చెప్పింది. చాలా ఈ ఎవిడెన్స్?''

డోపింగ్ టెస్టులో దొరికిపోయిన క్రీడాకారుడిలా తలవంచుకున్నాడు లంబోదరం. విచారవదనంతో ఇంటిదారి పట్టాడు. దారిలో సెల్ మోగింది. ఆ ఫోన్ చేసేదెవరో తెలుసు కనుక ఫోన్ తీయలేదు లంబోదరం. చాముండేశ్వరి వదల్లేదు... ఫోన్ రింగవుతూనే ఉంది. ఒంటి చేత్తో డ్రైవ్ చేస్తూనే సెల్ తీసి 'హలో' అన్నాడు లంబోదరం.

''ఇంక ఫోన్జేసే అవసరం లేదు కానీ పెట్టేయ్'' నీరసంగా అన్నాడు.

''అలాగే పెట్టేస్తా కానీ 'ఒరే ఒరే..నచ్చావురా, రారా-రారా సచ్చినోడా' పాట రాసిందెవరో చెప్పండి ముందు''

''ఆ దరిద్రుడెవరో నిజంగా నాకు తెలీదు నీమీదొట్టు''

''నేన్నమ్మను. మీ సినిమా నాలెడ్జి నాకు తెలుసు కానీ ముందు జవాబు చెప్పండి''

''ఎదురుగా లారీ వస్తోంది ఫోన్ పెట్టేయ్'' అంటూ లైను కట్ చేశాడు లంబోదరం. కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. లారీ దగ్గరికి రావడమే గుర్తుంది లంబోదరానికి, తరువాత ఏమయిందో తెలీదు.

★ ★ ★

అప్పుడే కళ్ళు తెరిచిన లంబోదరం ఎదురుగా ఉన్న అపరిచితుడిని చూశాడు ఎవరన్నట్టుగా.

''ఈయనేనండీ లారీ కింద పడబోయిన మిమ్మల్ని పక్కకి లాగి చివరి క్షణంలో రక్షించింది'' అన్నది చాముండేశ్వరి.

''థాంక్సండీ'' కృతజ్ఞతగా అన్నాడు లంబోదరం.

''థాంక్స్ చెప్పకండి. మీలాగే సెల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదంలో పడ్డవాళ్ళని ముగ్గుర్ని రక్షించండి చాలు'' అన్నాడతను.

''ఇలాంటి సందేశం ఎక్కడో విన్నానే'' అన్నది చాముండేశ్వరి.

''మా గురూగారు చిరంజీవి 'స్టాలిన్' సినిమాలో ఇచ్చిన సందేశం ఇలాంటిదే-మిమ్మల్ని రక్షించడానికి అదే ఇన్స్‌పిరేషన్ నాకు'' అన్నాడు అపరిచితుడు.

''మీరు చెప్పినట్టు మరో మూడు సెల్‌ఫోన్ యాక్సిడెంట్లు నివారిస్తాను. అంతేకాదు సెల్ చేత్తో పట్టుకొని రోడ్ల మీద రకరకాల బిల్డప్‌లిస్తూ కుప్పిగంతులేస్తున్న వాళ్ళకి అందువల్ల జరగబోయే ప్రమాదాలేంటో వివరించి ఈ విషయమై ప్రజల్లో చైతన్యం తేడానికి ప్రయత్నిస్తాను'' కృతనిశ్చయంతో అన్నాడు లంబోదరం.

☆

## ఆలీకి హీరో చాన్సులు

**'యమలీల'తో హీరో అయిన ఆలీ ఆ తర్వాత హీరోగా కొన్ని సినిమాలు చేసినా అంతగా కలిసిరాలేదు. తర్వాత కమెడియన్‌గా అనేక సినిమాల్లో నటించాడు. కొత్తగా 'గుండమ్మగారి మనవడు'తో సోలో హీరోగా తిరిగి కనిపించబోతున్న ఆలీకి మరో సినిమాలోనూ హీరోగా నటించే అవకాశం వచ్చింది. ప్రముఖ దర్శకుడు కె.వాసు రూపొందించే సినిమాలో ఆలీ హీరోగా ఎన్నికయ్యాడు. *2007* సంవత్సరం ఆలీకి కలిసొస్తుందేమో!**

